

రేపు మాస్టర్స్ బాడ్మింటన్ ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు ఈనెల 29న నిర్వహించనున్నామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసు, కిరణ్‌కుమార్ తెలిపారు. మోపాల్ మండలంలోని ఫిట్‌నెస్ క్లబ్‌లో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 35 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని, ఆసక్తిగల క్రీడాకారులు 9440007576 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మున్సిపాలిటీలలో.. ప్రత్యేక పాలన

- నగర పాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు
- ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు
- బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 38..
- భీంగల్ మున్సిపాలిటీలో పరిధిలో 12..

- నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా కలెక్టర్
- బోధన్, ఆర్మూర్, భీంగల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ అంకిత్
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న కార్పొరేషన్, మున్సిపాలిటీలు
- మేయర్ నీతూకిరణ్ హయాంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు



నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరకార్పొరేషన్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. నిజామాబాద్ నగర పాలకసంస్థకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును ప్రత్యేకాధికారిగా నియమించగా, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 120 మున్సిపాలిటీలతో పాటు 9 కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 26తో ముగిసింది. 2020 జనవరి 27న పాలకవర్గాలు పదవీబాధ్యతలు స్వీకరించాయి. ఈ నెల 26 ఆదివారంతో నిజామాబాద్ నగర పాలక సంస్థ పాలకవర్గంతో పాటు ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీలలోని పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. ఇకనుంచి మున్సిపాలిటీలతో పాటు కార్పొరేషన్‌లో ప్రత్యేక అధికారుల మార్గదర్శకత్వంలోనే పాలన సాగనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో అక్కడ కూడా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా పరిషత్‌కు కూడా ప్రత్యేక అధికారిగా ఉన్నారు. మున్సిపాలిటీలలో వార్డుల తో పాటు కార్పొరేష న్‌లలో డివిజన్‌లకు సైతం ప్రత్యేక అధికారులను నియమించే అవకాశాలు ఉన్నాయి. ఇకపై వీరిద్వారానే మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో పరిపాలన జరగనుంది. నిజామాబాద్ నగర కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో అనేక సమస్యలు ఉన్నాయి. సిబ్బంది కొరతతో పాటు అవినీతి ఆరోపణలు నిజామాబాద్ నగర పాలక సంస్థలో ప్రత్యేక అధికారికి స్వాగతం పలుకుతున్నాయి. ప్రత్యేక అధికారిగా నియమితులైన కలెక్టర్ సోమవారం బాధ్యతలు స్వీకరించగా మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా నియమితులైన అదనపు కలెక్టర్ అంకిత్ బాధ్యతలు స్వీకరించారు.

సమస్యలతో స్వాగతం..

ఐదేళ్ల పాటు ఉన్న పాలక వర్గ నిర్ణయాలు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా నియమితులైన కలెక్టర్‌కు కొత్త సమస్యలను తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. నిజామాబాద్ మేయర్‌గా పనిచేసిన దండు నీతూకిరణ్ హయాంలో నగర పాలక సంస్థలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిధుల దుర్వినియోగంతో పాటు ఇష్టారీతిన నిర్మాణాల అనుమతులు, డీజిల్ కుంభకోణాలు, సిబ్బంది కొరత ప్రత్యేక పాలన అధికారికి స్వాగతం పలుకుతున్నాయి. నగర పాలక సంస్థలో అనేక ఏళ్లుగా పేరుకుపోయిన పన్నుల వసూళ్లు సైతం ప్రత్యేక అధికారికి సవాల్‌గా నిలువనుంది. నగర పాలక సంస్థ పరిధిలో 60 డివిజన్‌లు ఉండగా డివిజన్‌లలో అనేక సమస్యలు ఉన్నాయి. శానిటేషన్‌తో పాటు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలు, ఇతరత్రా సమస్యలు ప్రత్యేక అధికారికి సవాల్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఐదేళ్ల పాటు పనిచేసిన పాలక వర్గంతో పాటు కార్పొరేటర్లపై అనేక ఆరోపణలు ఉన్నాయి. నగరంలో కార్పొరేటర్లు ఇష్టారీతిన భవనాల నిర్మాణానికి అనుమతులు ఇప్పించడం, కబ్జాలు చేయడం, తదితర ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకపాలన అధికారి నేతృత్వంలోనే నగరంలో ఇకపై భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉండటంతో కిందిస్థాయి సిబ్బంది ఏ విధంగా వ్యవహరిస్తారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగర పాలక సంస్థ అంటేనే అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉండటంతో ప్రత్యేక అధికారికి అనేక సవాళ్లు ముందు ఉన్నాయి.

డివిజన్లు, వార్డులకు ప్రత్యేక అధికారులు..

కార్పొరేషన్, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో కార్పొరేటర్లతో పాటు కౌన్సిలర్ల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 60డివిజన్‌లకు డివిజన్‌కు ఒక అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా మున్సిపాలిటీలలోనూ వార్డులకు అధికారులను నియమించే అవకాశాలు ఉన్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 5జోన్ కార్యాలయాలు ఉండగా వాటి ద్వారా ప్రత్యేక అధికారుల పాలన ఉండే అవకాశాలు ఉన్నాయి. జోన్ కార్యాలయాలకు సైతం అధికారులను నియమించే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేక అధికారులుగా నియమితులైన కలెక్టర్, అదనపు కలెక్టర్లు డివిజన్‌లు, వార్డులకు అధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

సుభాష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. నగర పాలక సంస్థ పాలకవర్గం పదవీ కాలం జనవరి 26న పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్

మున్సిపాలిటీలలోనూ అనేక సమస్యలు..

జిల్లాలోని ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీలలోనూ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ఆ మున్సిపాలిటీలకు సైతం ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఐఏఎస్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్‌ను మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఇకపై పాలన అంతా ప్రత్యేక అధికారి పర్యవేక్షణలోనే జరగనుంది. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులు, భీంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీ పరిధిలోనూ వార్డులలో అనేక సమస్యలు ఉన్నాయి. వార్డులలో ముఖ్యంగా పారిశుధ్య సమస్యతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని వార్డుల పరిధిలో తాగునీటి సమస్య సైతం ఉంది. నూతనంగా ఏర్పడిన భీంగల్ మున్సిపాలిటీ ఇంకా పూర్తిస్థాయిలో పరిపాలన సిబ్బంది లేకపోవడంతో అక్కడ కూడా సమస్యలు అధికంగానే ఉన్నాయి. ప్రత్యేక అధికారిగా నియమితులైన అదనపు కలెక్టర్‌కు మూడు మున్సిపాలి టీలలోనూ సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.



మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ అంకిత్

కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు!



- రాజస్థాన్ కేంద్రంగా సైబర్ మోసాలు
- జిల్లాలో 35 మ్యూల్ ఖాతాల గుర్తింపు
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఖిల్లా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ కేటుగాళ్లు అమాయక ప్రజల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారు. ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. కొత్త కొత్త యాప్‌ల పేర్లతో ప్రజలను నమ్మించి వారిని బుట్టలో వేసుకుంటున్నారు. రాజస్థాన్ రాష్ట్రం కేంద్రంగా జిల్లాలో సైబర్ మోసాలు జరుగుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేయడంతో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకంగా టెలిగ్రామ్ యాప్‌ను తయారు చేసి ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. జిల్లాలోనే టెలిగ్రామ్ యాప్ ద్వారా 335 బ్యాంకు ఖాతాలు లూటీకి గురైనట్లు సమాచారం. పోలీసులు గుర్తించిన ఖాతాల ద్వారా సుమారు రూ.50లక్షల డబ్బును అమాయక ప్రజల నుంచి లూటీ చేసినట్లు గుర్తించారు. వాస్తవానికి కోట్ల రూపాయలను అమాయ ప్రజల నుంచి కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. రాజస్థాన్ కేంద్రంగా కొనసాగుతున్న సైబర్ క్రైమ్‌లో నిజామాబాద్‌కు చెందిన 35మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.50లక్షల వరకు లూటీ చేసినట్లు ఇటీవల నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి తెలిపారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను నాల్గోటౌన్ పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 35మ్యూల్ ఖాతాలు, ఒక బ్యాంక్ పాస్‌బుక్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఖాతా నుంచి తన ప్రమేయం లేకుండానే రూ.1,04,999 డబ్బులు డ్రా అయిన విషయాన్ని బాధితుడు బసకొండ నరేష్ ఈనెల 9న నాల్గో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్ నేతృత్వంలో ఎస్సై శ్రీకాంత్ ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అయిన డబ్బులు మహ్మద్ అబ్దుల్ జవాద్ బ్యాంకు ఖాతాకు వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులు మహ్మద్ అబ్దుల్ జవాద్, గుడుముల సతీక్షలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా రాజస్థాన్‌కు చెందిన ప్రధాన వ్యక్తులు ఏజెంట్లుగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో నిజామాబాద్, బోధన్ చుట్టుపక్కల ప్రాంతా ప్రజలతో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించినట్లు తెలిసింది. ఈ ఖాతా నంబర్ ఏటీఎం కార్డు, సంతకాలు చేసిన చెక్‌బుక్‌లను.. డీటీడీసీ కొరియర్ ద్వారా రాజస్థాన్‌లోని ఏజెంట్లు సైబర్ నేరాలు చేసే ప్రధాన వ్యక్తులకు పంపేవారన్నారు. సైబర్ నేరగాళ్ల సంపాదించిన డబ్బుల నుంచి ఏజెంట్లకు ప్రతినెలా రూ.15000 అందిం చేవారన్నారు. ఈ కేసులో భాగంగా 35మ్యూల్ ఖాతాలను గుర్తించామన్నారు. ఇవి 35 ఖాతాలపై దేశవ్యాప్తంగా సుమారు 40 ఫిర్యాదులు నమోదయినట్లు చెప్పారు. కాగా, ఇంకా ఎవరైతే ఖాతాలను ఓపెన్ చేసి వాటిని పై వ్యక్తులకు ఇచ్చి దాని ద్వారా సైబర్ నేరాలను ప్రోత్సహించిన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజవెంకట్ రెడ్డి హెచ్చరించారు. అదే విధంగా బ్యాంకు అధికారుల పాత్రపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయని.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టామని ఆయన తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల అమాయక ప్రజలను అనేక విధాలుగా నమ్మించి వారి ఖాతాల నుంచి డబ్బులను ఖాజేస్తున్నారని తెలిపారు. అనుమానం రాగానే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు గాని డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలని, కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌లకు ఎవరికీ ఎటువంటి ఓటీపీలు చెప్పరాదని పోలీసులు సూచిస్తున్నారు.

మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

- జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్
- హాజరైన అధికారులు



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్



సమావేశానికి హాజరైన పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి, క్లోరోఫామ్, ఆల్ఫాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖలు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ నిరంతరం నిఘా కొనసాగించాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, తదితర అంశాలపై చర్చించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టవల్సిన చర్యల గురించి పోలీసు, ఎక్సైజ్, ఔషధ నియంత్రణ మండలి అధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. నిజామాబాద్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్రా, ఒడిస్సా, సరిహద్దు ప్రాంతాల నుంచి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపా దడపా మహారాష్ట్రకు సప్లయి చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులతో సమన్వయం పెంపొందించుకొని నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని గంజాయి విక్రయేతలను దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా కోర్టులకు సమగ్ర ఆధారాలను సమర్పించాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే ఆల్ఫాజోలం నిల్వలను వెలికి తీయాలని, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు వీటికి అలవాటు పడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు కలెక్టర్ తన ఛాంబర్‌లో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో పాటు ప్రముఖ మానసిక వైద్య నిపుణులు విశాల్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కేంద్రం ఏర్పాటు దిశగా తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ సూపరింటెండెంట్ నాయక్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, పోలీసు, ఎక్సైజ్, రవాణా, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

- జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రినివల్ చేయడం జరుగుతుందని చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ స్కానింగ్ కేంద్రంలో అయినా గర్భిణులకు స్కానింగ్ చేసిన తర్వాత పుట్టబోయే శిశువు ఆడ లేదా మగ అని తెలియ జేస్తే టీసీపీఎన్డిటీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు రిఫర్ చేసిన ప్రిస్కిప్షన్‌లను ఏ స్కానింగ్ సెంటర్ వైద్యులు కూడా సమ్మతించి స్కానింగ్ చేయరాదని వారి నిబంధనలకు అనుగుణంగా

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- కూరగాయలు, ఆకు కూరల సాగుతో మంచి గిట్టుబాటు
- రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

7

చిన్న, సన్నకారు రైతులకు శాపంగా ఆత్మీయ భరోసా నిబంధనలు!

- సొంత వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పనులకు వెళుతున్న రైతులు
- సెంట్ వ్యవసాయ భూమిలేని ఉపాధి కూలీలకు మాత్రమే ఆత్మీయ భరోసాకు అర్హులు



7

ఫటా..ఫట్...

అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు

● మధసూదన్‌రావు ఎక్సైజ్ సీఐ దోమకొండ



అక్రమంగా మద్యం ఎవరైన తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసకుంటాము.దోమకొండ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో కల్లు ముస్తేదారులు, వైన్స్ యాజమానులు, పర్మిట్‌రూంలలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారిలా..

ఆంధ్రజ్యోతి:మీ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

ఎక్సైజ్ సీఐ: దోమకొండ ఎక్సైజ్ పరిధిలో భిక్కనూరు, రాజంపేట,తాడ్వాయి, దోమకొండ, బీబీపేట 5 మండలాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి:మీ పరిధిలో ఉన్నటువంటి వైన్స్‌లు, కల్లు దుకాణాలు నిబంధనలకు లోబడి ఉన్నాయా?

ఎక్సైజ్ సీఐ: 5 మండలాల్లో ఉన్నటువంటి వైన్స్‌లు, కల్లు దుకాణాలు నిబంధనలు పాటిస్తున్నాయి. మా యొక్క సిబ్బంది ఎప్పటికపుడు తనిఖీలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి:వైన్స్ దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తారా నకిలీ మద్యం స్వాధీనం చేసుకున్నారా?

ఎక్సైజ్ సీఐ: మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమానం ఉన్నట్లయితే షాంపిళ్లు తీసుకోవడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి:కొన్ని గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు, ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు దొంగచాటున మద్యం విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి నిజమేనా?

ఎక్సైజ్ సీఐ:ప్రతి మండలంలో కానిస్టేబుళ్లు ప్రతి రోజు తనిఖీలు చేస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం అనేది అవాస్తవం.రాత్రి వేళల్లో కూడా సిబ్బందితో కలసి గ్రామాల్లో పర్యటిస్తూ తనిఖీలు చేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: బీబీపేట మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇష్టానుసారంగా కల్లుముస్తేదారులు లైసెన్స్‌లు లేకుండా అక్కడక్కడ దుకాణాలు పెట్టి కల్లు విక్రయిస్తున్నారని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు మీరేమంటారు?

ఎక్సైజ్ సీఐ:బీబీపేట మండలంలోనే కాదు ఎక్సైజ్ పరిధిలో ఉన్నటువంటి అన్ని గ్రామాల్లో లైసెన్స్ నిబంధనల ప్రకారమే కల్లును విక్రయిస్తున్నారు. అనుమతి లేని చోట కల్లు విక్రయించిన కొన్ని గ్రామాల్లో దుకాణాలు సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు కుడా నమోదు చేశాం.

ఆంధ్రజ్యోతి:గుడుంబా తయారీ, గంజాయి మొక్కల పెంపకం ఎక్కడైన జరుగుతుందా. వాటిని మీ పరిధిలో ఎక్కడైన పట్టుకున్నారా కేసులు ఎమైనా చేసారా?

ఎక్సైజ్ సీఐ: గత రెండున్నర సంవత్సరాలుగా ఎలాంటి కేసులు నమోదు కాలేదు.గంజాయి మొక్కల పెంపకం ఎక్కడ కూడా లేదు. గుడుంబా తయారీ కుడా లేదు. రాష్ట్ర స్థాయిలో గంజాయి, గుడుంబా లేని ఎక్సైజ్ స్టేషన్‌గా దోమకొండ ఉంది.

ఆంధ్రజ్యోతి:మీ 5 మండలలాకు సంబంధించి ఎన్ని గ్రామాలున్నాయి. సరిపోయేంత సిబ్బంది అందుబాటులో ఉన్నారా?

ఎక్సైజ్ సీఐ:మా పరిధిలో మొత్తం లైసెన్స్ ఉన్నవి 64 గ్రామాలున్నాయి. అందులో టీసీఎస్ 21, టీఎఫ్‌టీ 54 దుకాణాలు ఉన్నాయి. సీఐ, ఎస్సై తోపాటు హెడ్ కానిస్టేబుల్ 2, క్లర్క్ 2, 10 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నాము.

● (ఆంధ్రజ్యోతి,దోమకొండ)

త్వరలోనే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా

● డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి

నందిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి మొదటి వారంలో రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు జమకానున్నాయని నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం నందిపేట మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రూ.కోటి 26లక్షల 76వేల 100 వ్యయం నాబార్డు రుణంతో నిర్మించిన 2వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాంను ఐడీసీఎంఎస్ చైర్మన్ తార చంద్ నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం రైతుల ఖతాల్లో ఏకరాకు రూ.6వేల చొప్పున జమచేయన్నుట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తక్కువ సమస్యలతో వరి ధాన్యం కొనుగోళ్ల జరుగుతున్నట్లు రమేష్ చెప్పారు. క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు ఒక్కోక్క రైతు ఖాతాల్లో రూ.2లక్షల వరకు జమైనట్లు వెల్లడించారు. రైతులు సకాలంలో రుణాలు రకవరీ చేసుకుంటే 3 శాతం రిబేటు లభిస్తుందన్నారు. అది మార్చి నెలాఖరులోగా చెల్లించాలన్నారు. సహకార బ్యాంకులో రూ.లక్షన్నర ఉన్న రుణం రూ.2లక్షలకు పెంచామని, కేవలం రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి రైతులకు వివరించారు. సహకార బ్యాంకుల్లో రైతులు డిపాజిట్లు పెట్టాలని, కమర్షియల్ బ్యాంకుల కంటే ఒక శాతం ఎక్కువ వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ముందుగా ఐడీసీఎంఎస్ చైర్మన్ తార చంద్ నాయక్ మాట్లాడుతూ రైతుల సహకారం ఉంటేనే సహకార సంఘాల మనుగడ ఉంటుందని, లేదంటే నిర్వీర్యం అవుతాయని ఆయన అన్నారు. రైతులు సభ్యత్వాలు తీసుకొని సంఘాలను బలోపేతం చేయాలన్నారు. సంఘాల పనితీరుపై ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దని తార చంద్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, చింరాజ్‌పల్లి, డొంకేశ్వర్, మాక్లూర్ సొసైటీల చైర్మన్‌లు బొంకం గంగారెడ్డి, భరత్ రెడ్డి, అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, సొసైటీ సీఈవో దాసరి నరహరి, సొసైటీ మాజీ చైర్మన్ మీసాల లక్ష్మీనారాయణ, సొసైటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు నాయకులు తదితరులు ఉన్నారు.



ఐలాపూర్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

మోతెలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మోతెలో సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిల చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా సీఎం సహ యనిధి లబ్ధిదారులకు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సీఎం రిలిఫ్ ఫండ్ మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, ముత్యాల సునీల్‌కుమార్, అన్వేష్‌రెడ్డిలకు కాంగ్రెష్ నాయకులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవన్‌దాస్,సురేష్, రాజేశ్వర్, గంగారెడ్డి, సంజీవ్,రాజేందర్, రవికాంత్, నర్సారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు

'స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుంది'

బోధన్‌రూరల్,జనవరి27(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ 70శాతం వరకు సీట్లు కైవసం చేసుకుటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల లో ప్రజలకు మోసపూరిత వాగ్దాలు చేసి అధికారంలోకి వచ్చిందని ఆ పార్టీ చేసిన మోసాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ పథకాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలిచి ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్, ఎంపీటీసీలు, సహకార సంఘాల చైర్మన్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు అధిక స్థానాలను కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలు ప్రధాని మోడీ వైపు చూస్తున్నారని వచ్చే ఎన్నికలలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో సకల శుభాలు

● శివాలయంలో ఘనంగా శివపార్వతుల కల్యాణం

బోధన్‌రూరల్,జనవరి27(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివాలయం 66వ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 29న ఆలయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఆలయ వేద పండితులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శివనామ స్మరణతో పఠించాలని, శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడు బైక్‌లు సీజ్ చేసిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్, జనవరి27(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని సౌండ్ పొల్యూషన్ ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్న ఏడు బైక్‌లను సీజ్ చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. బైక్‌ల యొక్క సైలెన్సర్‌లను మాడిఫై చేసి సౌండ్ పోల్యూషన్ చేయడంతో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలో నాళేశ్వర్‌కు చెందిన చిన్న దొడ్డి రాజేందర్(30)అనే వ్యక్తి ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుడు రాజేందర్‌కు నాలుగు సంవత్సరాల క్రితం నిజామాబాద్‌కు చెందిన మహిళతో వివాహం కాగా పెళ్లి అయిన సంవత్సరం లోపే భార్యతో విడాకులు జరిగాయని అన్నారు. గ్రామంలో ప్రైవేటు ఎలక్ట్రిషన్‌గా పని చేసే రాజేందర్ మద్యానికి బానిసయ్యాడని, మృతుడికి హన్మాండ్లు అనే 80సంవత్సరాల వయసు గల వృద్ధాప్యంలో ఉన్న తండ్రి ఉన్నాడని అన్నారు.మృతుడి కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో పోలీసులకు సమాచారం అందించకుండా మృదేహనికి సోమవారం బంధువులు అంత్యక్రియలు నిర్వహించారని అన్నారు. రాజేందర్ మృతిపై తమకు ఎటువంటి అనుమానంలేదని,పేదరికం కారణంగానే పోలీసులకు సమాచారం అందించకుండా అంత్యక్రియలునిర్వహించడం జరిగిందని మృతుడి సోదరిమణులు రాజమణి, సునీతలువాగ్మూలం రాసి ఇచ్చినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు. ఈవిచారణలో మాక్లూర్ ఎస్‌ఐ ఉన్నారు.

కూలీ పనికి వెళ్లి వ్యక్తి మృతి

రెంజల్,జనవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన యేశా ప్రశాంత్(28)అనే వ్యక్తి కూలీ పనికి వెళ్లి మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలుతాడ్‌బిలోలి గ్రామానికి చెందిన ప్రశాంత్ ఆదివారం అదే గ్రామానికి చెందిన పద్మశాలి కిషన్ అనే వ్యక్తికి పొలంలో మందును పిచికారి చేయడానికి కూలీ పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి పొలంలో పడిపోవడంతో గమనించిన యాజమాని హుటహుటిన బోధన్ ఆసుపత్రికి తరలించారు. ఊపిరితిత్తులోకి బురద పోవడంతో శ్వాస ఇబ్బందిగా తీసుకోవడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం జరిగిందని, చికిత్స పొందుతూ మృతి చెందాడని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు, మృతుడి బావఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కోటగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన గంగామణి (38) అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఇంట్లో గొడవలతో పాటు కొంత కాలంగా అనారోగ్యానికి గంగామని మనస్తాపంతో ఎలుకల మందు త్రాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది.చికితక్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిక్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సైసందీప్ తెలిపారు.మృతిరాలి తనయుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకుకేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా సాయరెడ్డి



హైదరాబాద్‌లో కేఆర్ సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు

నందిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన బద్దం సాయరెడ్డి టెలికాం అడ్వైజరి కమిటీ (టీఏసీ ఆఫ్ బీఎస్ఎన్ఎల్, నిజామాబాద్) సభ్యులుగా నియమితులైనారు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎటువంటి తాయిలాలకు తలోగ్గకుండా పార్టీ కోసమే పని చేశారు. నిజామాబాద్ బీఎస్ఎన్ఎల్ సేవల విస్తరణ కోసం పని చేస్తానని బద్దం సాయరెడ్డి ప్రకటించారు. టెలికాం అడ్వైజరి కమిటీ సభ్యులుగా తన ఎన్నికకు కృషి చేసిన నిజామాబాద్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మానించి బొకేను అందజే శారు. టెలికాం అడ్వైజరి కమిటీ (టీఏసీ ఆఫ్ బీఎస్ఎన్ఎల్, నిజామాబాద్) సభ్యులుగా ఎన్నికైనందుకు నందిపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి నికాల్‌పూర్‌లో చిలుక చిన్నమ్మ జాతర

డొంకేశ్వర్, జనవరి27(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో ఈనెల 28, 29తేదీల్లో జరిగే చిలుకల చిన్నమ్మ జాతరకు ఆలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 28న అమ్మవారికి పందిరి, విగ్రహాల అలంకరణ, ప్రత్యేక పూజలు, 29న దేవతల విగ్రహాలను ఆలయంలో ఊరేగింపు, గంగస్నానం, డప్పువాయిద్యాలతో తీసుకువెళ్ళి పూజలు నిర్వహిస్తారు. మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం పోసి దేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ జాతరకు ఇతర జిల్లా నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారని వీడీచైర్మన్ రావుల సుబాష్, కోశాధికారి బీంనాయక్ తెలిపారు.

సీపీఎస్ స్థానంలో పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

బోధన్‌రూరల్,జనవరి27(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ స్థానంలో పాత పింఛన్ విధానాన్ని పునరుద్దరించాలని సోమవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు పీఆర్‌టీయూ అర్బన్, రూరల్ శాఖ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డివిజన్ మాజీ ఇన్‌చార్జి ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్ ఏకీకృత పింఛన్ స్కీమ్ ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ బోధన్ మండల రూరల్, అర్బన్ అధ్యక్షులు థామస్, ఖైరన్, ప్రధాన కార్యదర్శులు పెంట గంగాధర్, ప్రాథమిక సభ్యులు కిషన్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని గత కొంతకాలంగా ఉపాధ్యాయులు కోరుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సంకేపల్లి గంగాధర్, నరేంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్, లింబాద్రి, జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ పటేల్, పీఆర్‌టీయు మండల అధ్య క్షుడు గద్దె గంగా ధర్, ప్రధానకార్యదర్శి నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

రెంజల్ : ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్ మాటాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరసింహ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, శంకర్, శ్రీరామ్, సునీల్, అయుబ్, బాలకృష్ణ, అపర్ణ, రాజశ్రీ, రాజేందర్, ప్రవీణ్, ప్రసాద్, శ్రీకాంత్, సాయిబాబా పాల్గొన్నారు.

కోటగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ ఇవ్వాలని పీఆర్‌టియు మండల అధ్యక్షులు బర్ల సాయిలు కోరారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ గంగాధర్‌కు ఈ విషయమై వినతిపత్రాన్ని అందజేశారు. పోతంగల్ మండల పీఆర్‌టియు ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఉదయ్ చందర్, గంగారాజు, శానం సాయిలు, సుధీర్, హర్షద్ హుస్సేన్, రవీందర్, కృష్ణమోహన్, పాష‌, సుమన, సుచిత్ర, వాణి, మల్లికార్జున్, పోతంగల్‌లో శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాం పాల్గొన్నారు.

రుద్రూర్ : యూనిఫైడ్ వ్యతిరేకిస్తూ మండల పీఆర్‌టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తారాబాయికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల పీఆర్‌టియు అధ్యక్షులు వై.విఠల్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే.రాంసింగ్, మండల పీఆర్‌టియు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ దస్తగీర్, మండల బాధ్యులు రాములు, రాష్ట్ర బాధ్యులు ప్రకాష్, వి.రమేష్, భవానీ, మారుతి, శివకుమార్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. డొంకేశ్వర్ మండల తహసీల్దార్ నరేష్‌కుమార్‌కు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలు సమస్యలతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు గంగారెడ్డి, మహేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యుపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయు ఆధ్వర్యంలో సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.సురేష్‌కుమార్, ఎం.ప్రశాంత్‌కుమార్, ఎ.రాంకిషన్, బి.శంకర్, బి.రాములు, జె.సుంధర్, షకీల్, తదితరులు పాల్గొన్నారు. పీఆర్‌టీయు ఆధ్వర్యంలో సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో నయాబ్ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కొండ్రు నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుండోజి నరేందర్, సామ ప్రసాద్, తాడూరి లక్ష్మణ్, ఎస్‌జీ.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల అసోసియేట్ అధ్యక్షుడు గండికోట రవి, మండల కార్యదర్శి గంగారాజుల రాజేష్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన (యూపీఎస్) యూనైటేడ్ పెన్షన్ స్కీను వ్యతిరేకిస్తు సోమవారం పీఆర్టీయూ కమ్మర్‌పల్లి మండల శాఖ ఉపాధ్యాయులు కమ్మర్‌పల్లి ఎం తహసీల్దార్ అంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు యూపీఎస్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు.



బోధన్ సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సీసీ రహదారి పనులను ప్రారంభించిన నాయకులు

పెద్ద కొడప్‌గల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి సిసి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతు గ్రామంలో ఉపాధిహామి నిధులు 5 లక్షల రూపాయలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఇప్పటికే ఉపాధి నిధుల ద్వారా సిసి రహదారి నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి చేయలేని పనులను తాము చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ళ కాలంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వడం మరిస్తే తాము గ్రామాలలో అర్హులను గుర్తించి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, శ్యామప్ప పాల్గొన్నారు.

మామిడిపల్లిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, జనవరి27(ఆంధ్రజ్యోతి) మున్సిపల్ పరిధిలో మామిడిపల్లి 24వార్డులో బాలాజీనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసినట్టు మాజీమున్సిపల్ కౌన్సిలర్ ఆకుల రాము తెలిపారు. గత కొద్దిరోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వీదిదీపాల ఏర్పాటు కోసం మున్సిపల్ నిధులతో రూ.60వేలతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పోషకాహార లోపం నివారించవచ్చు

పెద్ద కొడప్‌గల్, జన వరి 27 (ఆంధ్రజ్యోతి): 5 సంవత్సరాల లోపు పిల్లల్లో పోషకాహార లోపం సరియైన సమయంలో గుర్తిస్తే దానిని నివారించవచ్చని ఐకెపి జిల్లా మాస్టర్ ట్రైనర్ రాంనారాయణ్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఐకెపి భవనంలో వివోఏ, గ్రామ సంఘ సభ్యులకు పోషకాహార లోపంపై తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాంనారాయణ గౌడ్ మాట్లాడుతు గ్రామాలలో ఐదేళ్ళలోపు పిల్లలలో పోషకాహార లోపం ఉంటుందని, దీని వలన పిల్లల్లో శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీనపడుతుందని తెలిపారు. దీనిని నివారించాలంటే సాధారణ ఆరోగ్య, పోషకాహార పద్ధతులను అనుసరించి పోషకాహార లోపం నివారించవచ్చని తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపం నివారించడానికి యూనిసెఫ్, సెర్ప్, ఎన్ఐఆర్‌డిపిఆర్ వంటి సంస్థల సహాయంతో పోషకాహార లోపం నివారిస్తున్నామని తెలిపారు. మహిళలు గర్భధారణ సమయంలో పోషకాలతో కూడిన ఆహారం తినడం వలన కూడ పిల్లల్లో పోషకాహార నివారణ చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది సాయిలు, దూప్‌సింగ్, స్వామి, బాలాజీ, రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడా సామగ్రి వితరణ

ఆర్మూర్‌రూరల్, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థుల సౌకర్యార్థం దిలిప్ సుమారు రూ.12వేలు క్రీడా సామాగ్రిని వితరణ చేశారు. పది వాలీబాల్, నాలుగు హ్యాండ్‌బాల్స్, బ్యాడ్మింటన్ నెట్, క్రికెట్ నెట్‌లను దిలిప్ సమకూర్చి పాఠశాల హెచ్‌ఎం నరేందర్‌కు అందజేశారు. క్రీడా సామాగ్రిని అందజేసిన దాతను పీడీ రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ మార్కంటి మల్లేష్, మాజీఉపసర్పంచ్ దొమ్మజి శ్రీనివాస్, గాండ్ల రాంచందర్, లక్ష్మణ్, పాల్గొన్నారు.ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దుబ్బాక యాదగౌడ్ రూ.31వేల విలువ చేసే 130 జ తల స్కూల్ షూలను పంపిణీ చేశారు.

డ్రాప్ అవుట్ పిల్లల గుర్తింపు

నిజాంసాగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండల కేంద్రంలోని నరసింగరావుపల్లి హబిటేషన్ పరిధిలో సోమవారం నాడు బడి మానివేసిన ముగ్గురు విద్యార్థులు మతేలి, ఆరాధ్య, హర్షితలను డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల నర్సింగరావుపల్లిలో ఒకటవ తరగతిలో చేర్పించారు.. ఈసందర్భంగా సీఆర్పీ బి.శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ బడి వయసు కలిగిన పిల్లలు బడి బయట ఉండటానికి వీళ్లేదన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల బయసు కలిగిన వారు కూడా ఎవరైనా తమ విద్యను మధ్యలో ఆపివేసినట్లయితే వారు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఓపెన్ స్కూల్ సొసైటీలలో పదవ తరగతి ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశం పొందాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

అంకాపూర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం

ఆర్మూర్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సోమవారం మేముల లచ్చగౌడ్ సత్తెమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భుజంగారెడ్డి గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అద్దాలు, మందులను పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ ఛైర్మన్ వేముల లింగాగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా గ్రామస్థులకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్‌ఛైర్మన్ వేముల చంద్రకళ, వాసు గౌడ్, ట్రస్టు సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్య బహుమతులు అందుకున్న విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఏర్గట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కేనడా దేశం కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా తెలుగు పిల్లల కోసం వెలువడుతున్న గడుగ్గాయి అంతర్జాతీయ పత్రిక వారు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన కథలు అలాగే కవితా పోటీల్లో విద్యార్థులు రూపక్, నవదీప్, శ్రీనిధి, అశ్విని, అభిలాష్, రిశ్వంత్, వైష్ణవిలు అంతర్జాతీయ బహుమతులు గెలుపొందినట్లు తెలుగు పండితులు ప్రవీణ్‌శర్మ తెలిపారు. సోమవారం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి అందజేశారు. ఉపాధ్యాయులు మునీరోద్దిన్, శ్రీనివాస్, రాజశేఖర్, రాజ నర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు కులస్థులు రాణించాలి

బోధన్‌రూరల్,జనవరి27(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు కులస్థులు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బ్రహ్మణగల్లీలో మున్నూరు కాపు సంఘం బ్రహ్మణగల్లీ తర్పా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు బీర్కూర్ బుజ్జి, బోధన్ పట్టణాభివృద్ధి అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం యొక్క ఐక్యత, అభివృద్ధి గురించి ప్రతి ఒక్క కుల సంఘ సభ్యుడు కృషి చేయాలన్నారు. నూతన కమిటీ అధ్యక్షులు గాదె గోవర్ధన్, ఉపాధ్యక్షులు పాండ్ర మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గాదె సందీప్, సంయుక్త కార్యదర్శి గజేందర్, కోశాధికారి మహేందర్, గౌరవ సలహదారులు పాలకుర్తి పోశెట్టి, గాదె పోశెట్టి, పాలకుర్తి సాయిరెడ్డి, గాదె లక్ష్మణ్, నడిపి సాయన్న, మున్నూరు కాపు సంఘం సభ్యులున్నారు.

సిద్దులగుట్టపై భక్తుల ప్రత్యేక పూజలు

పెర్కిట్, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో సిద్దేశ్వ రునికి అభిషేకాలు చేశారు. గుట్టపై గల రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో బిల్వ పత్రాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర జిల్లాలు కరీంనగర్, నిర్మల్, బైంసా, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి సిద్దేశ్వరుని దర్శించుకున్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో భజన మండలి సభ్యులు, భక్తులు భక్తిపాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సిద్దులగుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దురప్రాంతాల నుంచి భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించతలపెట్టిన కాటేజీలకు విరాళాలు ఇవ్వదలుచుకున్న భక్తులు అలయ కమిటీ వారిని సంప్రదించాలని తెలిపారు. నూతుల వేణు కుటుంబసభ్యులు గుట్టపైకి వచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, బట్టు శంకర్, చెందేసి శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, హజరి సతీష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట రక్షణ కోసం

కొండెంగల ఫ్లెక్సీల ఏర్పాటు

మెండోర, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు చీడపీడలతో పాటు పంటలను ధ్వంసం చేసి కోతులు రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. అటవీ విస్తీర్ణం తగ్గడంతో ఉండాల్సిన వానర సైన్యం గ్రామాల్లోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కోతులు గ్రామాల్లోని పంటలను ధ్వంసం చేస్తూ రైతున్నలను తీవ్ర నష్టపరుస్తున్నాయి. ఈ వానర సమస్యలను అదిగమించేలా మెండోరకు చెందిన నితిన్‌రెడ్డి అనే యువకుడు రైతు కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. తన మొక్కజొన్న పంటను కోతులు ధ్వంసం చేస్తున్నాయని మొక్కజొన్న చుట్టు కొండెం గల ఫ్లెక్సిలు ఏర్పాటు చేయడంతో కోతులు ఆ ఫ్లెక్సీలలో ఉన్న కొండెంగ బొమ్మను చూసి భయపడు తున్నాయి. ఆలోచనతో ఐడియా అదిరింది గురు అంట ప్రజలు చర్చించుకుంటున్నారు.

వినయ్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డిపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎఎంసీఛైర్మన్ సాయిబాబాగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వినయ్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడిన సంభాషణ తన వద్ద ఉందని ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎఎంసీ వైస్‌ఛైర్మన్ ఇట్టెం జీవన్, కాంగ్రెస్ నాయకులు పండిత్ పవన్, కొంతం మురళీ, జితేందర్, మారుతిరెడ్డి, ఆర్మూర్, ఆలూర్ మండలాల అధ్యక్షులు చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నియమ నిబంధనలు పాటించాలి

మద్నూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాన్ని నడపాలని హైవేస్ ప్రైవేట్ లిమిటెడ్ రక్షణ మేనేజర్ బాల్‌రాజ్ అన్నారు. మద్నూర్‌లోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు రోడ్డు భద్రతలపై అవగాహన సదస్సును నిర్వహించారు. మాసోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు అవగాహనను కల్పించారు.



హసాకొత్తూర్‌లో అగ్నిగుండ ప్రదర్శనలో యాదవులు

హసాకొత్తూర్‌లో ఘనంగా మల్లన్న స్వామి పూజలు

కమ్మర్‌పల్లి జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ గ్రామ శివారుల్లోని ఆలయంలో కొలువుదీరిన యాదవుల ఆరాధ్య దైవం మల్లన్న స్వామి కల్యాణం, జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయం వద్ద ఎల్లమ్మ పట్నాల ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో యదవుల సంప్రదాయ పద్ధతిలో పట్నాలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాలొగన్నారు. అనంతరం ఎల్లమ్మ బోనాలు సమర్పించి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అగ్ని గుండం ఏర్పాటు చేసి ఖణఖణ మండే అగ్ని కీలలపై నడిచి మొక్కలు చేల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు ఏదుల్ల అంజయ్య, కోశాధికారి జి.నరేష్ యాదవ్, మామిడి చిన్న సాయన్న, మామిడి మహేష్ యాదవ్, గ్రామ యాదవ సంఘాల సభ్యులు, మల్లన్న దీక్షాపరులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



హసాకొత్తూర్‌లో మల్లన్న పూజల్లో పాల్గొన్న యాదవ సంఘాల పభ్యులు

మూతపడ్డ మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

● తోర్నాల కళాశాలకు విద్యార్థుల తరలింపు ● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు ● కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం వృథా

నాగిరెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల మూత పడింది. ఈ కళాశాలలోని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఇక్కడి నుంచి సిద్దిపేట జిల్లా తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళా శాలకు అధికారులు తరలించడంతో ఈ కళాశాల మూత పడింది. కళాశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంద న్న కారణంగా ఉన్నతాధికారులు ఈ కళాశాల విద్యా ర్థులను తోర్నాక కళాశాలకు తరలించారు. మొదటి డిసెంబర్ మాసంలో ఈ కళాశాలలో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులను తోర్నాక పాలిటెక్నిక్ కళాశాలకు తరలించగా, సెమిస్టర్ పరీక్షల అనంతరం జనవరి రెం డో వారంలో మొదటి సంవత్సరం విద్యార్థులను సైతం తోర్నాల కళాశాలకు తరలించారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం 20 సీట్లకు గాను 12 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 20 సీట్లకు గాను 13 మంది విద్యార్థులు ఉండగా, కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి గాను 40 మంది విద్యార్థులకు గాను 25 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఈ కళాశాల విద్యార్థులను ఇక్కడి నుంచి తోర్నాల కళాశాలకు తరలించారు. దీంతో ఇక్కడి కళాశాల మూత పడింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల మాల్తుమ్మెదలో 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ను ఏర్పాటు చేసింది. గత ఎనిమిదేళ్ల పాటు ఇక్కడ కొనసాగిన ఈ పాలిటెక్నిక్ కళాశాల, ప్రస్తుత విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందన్న సాకుతో ఇక్కడి కళాశాల విద్యా ర్థులను ఇతర చోటికి తరలించి ఈ కళాశాల ను మూసేశారు.



వృథాగా మారిన మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఆధునాతన భవనం

● కళాశాల మూతపడ్డ పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

మాల్తుమ్మెద ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను ఇక్కడి నుంచి ఇతర కళాశాలకు తర లించి కళాశాల మూత పడినా ఇక్కడి ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలానికి కొత్తగా ఏదైనా కళాశాల మంజూరీ కావాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎంతో శ్రమించాల్సి ఉంటుందని, అలాంటిది 2015లో మండలానికి మంజూరైన ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను ఇక్కడి నుంచి ఇతర కళాశాలకు అధికారులు తరలించినా, కళాశాల మూత పడినా ఇక్కడి ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

● కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి

మాల్తుమ్మెదలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవ నంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ఇక్కడి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను ఇతర చోటికి తరలిం చడంతో ఇక్కడి కళాశాల మూతపడటంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆధునాతన కళాశాల భవనం వృథాగా మారింది. ప్రస్తుతం ఈ కళాశాల భవ నంలో ఓ పక్క ఏరువాక కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేయనున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ కృషి విజ్ఞాన కేంద్రాన్ని మాల్తుమ్మెదకు మంజూరు చేయాలని స్థాని క ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కృషి చేస్తున్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

● కూరగాయలు, ఆకు కూరల సాగుతో మంచి గిట్టుబాటు
● రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది
● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కూరగాయలు, ఆకు కూరలు పండించడంతో అధిక దిగుబడి పొందవచ్చని, ఈ పంటలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సబ్సిడీలతో పాటు సహాయ, సహకారాలు అందిస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతు వేదికలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంటల నమోదు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఏ మండలాల్లో రైతులు ఇతర కూరగాయల పంటలు వేస్తున్నారా అని ఆరా తీశారు. అర ఎకరంలో పండించిన వారికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో కనీసం 150ఎకరాలలో కూరగాయలు, ఆకు కూరలు వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 2వ తేది వసంత పంచమి సందర్భంగా రైతులందరికీ సబ్సిడీ చెక్కులు అందజేయబడతాయన్నారు. రైతులు క్వాలిటీ, నాణ్యతతో కూడిన కూరగాయలు, ఆకు కూరలు పండించాలన్నారు. నేడు తెలంగాణలో ఇతర రాష్ట్రాల నుండి టమాట, బెండకాయ, బీరకాయ వంటి అనేక ఆకు కూరలు, కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి వస్తున్నాయన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంట కూరగాయల సాగు అని కావున రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి అధిక దిగుబడి పొందాలన్నారు. రైతులకు నాలుగు నెలలకోసారి ఏడాదికి మూడు పంటలు వస్తాయన్నారు. భూసార పరీక్షలు చేసుకోవాలని, ఎత్తులో ఉన్న భూముల పంటల్లో కూరగాయలు, ఆకు కూరలు మంచిగా పండుతాయన్నారు. కావున రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ వ్యవసాయ అధికారి సంతోష్‌లతో నియోజకవర్గంలోని ఆయా మండలాల రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

● గంజాయి, డ్రగ్స్ రవాణాను నియంత్రించాలి

బోధన్ పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ గంజాయి, డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించి పట్టుపడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటల్లో కొంతమంది గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లను దొంగలిస్తున్నారని ఇలాంటి వారిని గుర్తించిపై వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. బోధన్‌లో గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతుందని కొంతమంది ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ బస చేసి యువకులను చెడు దోవ పట్టిస్తున్నారన్నారు. అలాంటి వారిపై పోలీసులు గుర్తించి ఉక్కుపాదం మోపాలన్నారు.

విద్యార్థినుల నృత్యాలు అదరహో!

బాన్సువాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల బాలుర కళాశాల క్రీడా వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో కళాశాల విద్యార్థినుల నృత్యాలతో కేవ్వు కేక అనిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నృత్యాలు చేస్తూ మైసమ్మ, బతుకమ్మ, లంబాడి డ్యాన్సులతో విద్యార్థినులు అలరించారు. స్టెప్పులతో సింగింగ్‌తో కళాశాల ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. విద్యార్థినుల నృత్యాలు చూసిన వారందరూ క్యా డ్యాన్స్‌రే అంటూ ప్రశంసలు అందజేశారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

చిన్న, సన్న కారు రైతులకు శాపంగా మారిన
ఆత్మీయ భరోసా నిబంధనలు



ఉపాధి కూలీలుగా పని చేస్తున్న రైతులు

మద్నూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్న కారు రైతులు ఎకరం రెండెకరాల భూమి ఉన్న వారి కుటుంబాల నుంచి గ్రామాల్లో తమ సొంత వ్యవసాయం చేసుకుంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళుతున్నారు. చిన్నకారు రైతు కుటుంబాలు అటు వ్యవసాయంపైన ఇటు కూలీలపైన ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గ్రామాల్లో నిరుద్యోగులు అటు యువతి యువకులు, మహిళల్లోనూ అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ నెల 26 నుంచి అమలు చేసిన భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేసింది. ఏడాదికి రూ.12 వేలను రెండు విడతలుగా రూ.6 వేల చొప్పున అందించేందుకు సిద్ధమైంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టడంతో గ్రామాల్లో చాలా మంది తమకు ఈ పథకం వర్తిస్తుందని కొండంత ఆశతో ఉన్నారు. అయితే ప్రస్తుతం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలను జాబ్ కార్డు ఆధారంగా 2023-24 సంవత్సరంలో 20 రోజుల పాటు పనులకు వెళ్లిన వారు సెంట్ వ్యవసాయ భూమి లేని ఉపాధి కూలీలను మాత్రమే అర్హులుగా తేల్చి వారికే అమలు చేయబోతున్నారు. వీరి జాబితాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిద్ధం చేసి గ్రామ సభలకు పంపించారు. గ్రామసభల్లో వారి పేర్లను బహిరంగం చేసి వారికి వ్యవసాయ భూములు ఉన్నాయా లేదా అన్న దానిపై లెక్క తేల్చనున్నారు. నిబంధనలు అనుసరిం చి 20 రోజుల పాటు ఉపాధిహామీలో పాల్గొని భూమి లేని నిరుపేదల ఎవరైనా అర్హుల జాబితాలో లేకపోతే వారి వివరాలను కూడా తీసుకుని అర్హుల జాబితా లో చేర్చే అవకాశం ఉంది. జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో రైతుల సంఖ్య భూముల సంఖ్య కూడా అధికంగానే ఉంది. అదే క్రమంలో గ్రామాల్లో వ్యవసాయ కూలీల సంఖ్య కూడా అధికంగానే ఉంది. ఉదాహరణకు ఉమ్మడి మద్నూర్ మండలంలో 14846 జాబ్ కార్డులు ఉండగా 727 మందిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేసినట్లు జిల్లా అధికారులు జాబితా పంపించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 18098 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

పాఠశాలల్లో బడిబయట పిల్లల చేరిక

మాచారెడ్డి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలం కాకులగుట్ట తండా ఆవాస పరిధిలోని ఇటుకబట్టీల వద్ద పనిచేస్తున్న 14 మంది బాలకార్మికులను ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యాశాఖ సిబ్బంది చేర్పించారు. అదేవిధంగా ఎంపీపీఎస్ ఎక్స్‌రోడ్‌పాఠశాలలో మరో నలుగురు పిల్లలను చేర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌రెడ్డి, వెంకటచారి, రాజేశ్వరిదేవి, జ్యోతి, ఉపాధ్యాయులు లత, సీఆర్‌పీలు నరేష్,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థినులు కష్టపడి చదవాలి

● బాన్సువాడ నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతున్నాం ● ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థినులు తమ లక్ష్యసాధన కోసం కష్టపడి ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల బాలుర కళాశాల క్రీడా వార్షికోత్సవ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అధ్యాపక బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలను వారు తిలకించారు. అనంతరం క్రీడా దినోత్సవంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. అదేవిధంగా కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు మెమెంటో నగదుతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు పోచారం మాట్లాడుతూ 1998లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అంచలంచెలుగా ఎదుగుతూ ఇటు బాలుర అటు బాలికల కళాశాలలో విద్యార్థినులు ఉన్నతమైన చదువుల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, నోడల్ అధికారి సలాం, కళాశాల యాజమాన్యం సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా వార్షికోత్సవంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని పోచారం నివాసంలో సోమవారం బాన్సువాడ పట్టణ, బాన్సువాడ గ్రామీణ, నసురుల్లాబాద్, మెస్రా మండలాల కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ 181 లబ్ధిదారులకు చెక్కులను ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బాన్సువాడ పట్టణంలో 41 మంది లబ్ధిదారులకు రూ.41,04,756, బాన్సువాడ మండలంలోని 77 మంది లబ్ధిదారులకు రూ.77,08,932, నసురుల్లాబాద్ మండలం 32 మంది లబ్ధిదారులకు రూ.32,03,712, మెస్రా మండలం 31 మంది లబ్ధిదారులకు రూ.31,03,596, మొత్తం 181 లబ్ధిదారులకు రూ.1,81,20996ను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు.

ఫిబ్రవరి 23న ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

● పది వేలకుపైగా పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలి
● ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ఎన్‌కె డిగ్రీ కళాశాల ప్రారంభమై 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఎన్‌కె డిగ్రీ కళాశాల చైర్మన్, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కె డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ముఖ్య అతిథిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ 1998లో ఎస్ఆర్ఎన్కె డిగ్రీ కళాశాల ప్రారంభమై అంచలంచెలుగా అన్ని సౌకర్యాలతో 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంగరంగ వైభవంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు రాష్ట్ర మంత్రిత్వ శాఖతో పాటు సుమారు 10 వేలకు పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ వేడుకలకు వివిధ కమిటీల ఏర్పాటు చేసుకొని ఆ కమిటీ సభ్యులతో విజయవంతం అయ్యేలా చూడాలన్నారు ఇప్పటివరకు 25 వేల మంది పట్టభద్రులు అయ్యారని 20 వేల మంది ఉద్యోగాలు పొందారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ఎన్కె డిగ్రీ కళాశాల అన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, అధ్యాపక బృందం సీడీసీ సభ్యులు, పూర్వ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన

● చెత్తాచెదరంతో నిండిన మురుగుకాలువలు ● పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ప్రజల డిమాండ్

డొంకేశ్వర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పల్లెలో అపరి శుభ్రం తాండవిస్తుంది. ప్రత్యేక పాలన అధికారులు పర్యవేక్షణ కరువైంది. దీంతో గ్రామాల్లో చెత్తాచెదరం గుట్టలుగా పెరుకుపోయిన పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దోమలతో వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోగాల బారినపడ్డ జనం ఆసుపత్రులకు పురుగులు పెడు తున్నారు. డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలో పారిశుధ్యంపై అ ధికారులు పర్యవేక్షణ కరువైంది. నిర్వహణ గాడి తప్పింది. మురుగు కాలువల్లో నిండిపోయి రోడ్లపైన చెత్త చెదారం పేరుకుపోయింది. మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని మండిపడుతున్నారు. పెరుకుపోయిన చెత్తపైన దోమలు వృద్ధి చెంది వ్యాధుల భారినపడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి డ్రైనేజీ శుభ్రం చేయకపోవడం తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ నీళ్లు వెళ్ళలేక ప్రధాన రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారి వెంట అనేక సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డుపై పారుతున్న మురుగు నీరు పైనే ప్రయా ణించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని పండి పడుతున్నారు.



డ్రైనేజీ పక్కనే పడేసిన చెత్తాచెదారం

దోమలకు ఈగల బెడద

ఇళ్ళ మధ్య చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, ఈగల బెడదతో జనం అలాలడు తున్నారు. చెత్తకుప్పలు దట్టంగా పెరిగిపోయి రాత్రి సమయంలో విషసర్పాలు తిరుగు తున్నాయి. భ యం చెందు తున్నారు. మురు గునీళ్లు, దోమలకు ఆవాసంగా మారాయి. దోమ కాటుతో వ్యాధుల భారిన పడి ఆసుపత్రులకు పరుగులు పడుతున్నామని వాపోతున్నారు.



నడ్కుడలో డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు నీరు

దోమలతో ఇబ్బంది పడుతున్నాం

● గంగా సాగర్, జీజీ నడ్కుడ



నెలల తరబడి మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో దోమలు పెరిగి పోతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. దోమకాటుతో వ్యాధులు బారిన పడి ఆసుపత్రులు చేరాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

(ఐదో పేజీ తరువాయి)

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. మెడికల్ షాపుల్లో అబార్షన్ కోసం వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్ లేనిదే అమ్మరాదన్నారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని లేనిచో వారికి రిజిస్ట్రేషన్ కానీ, రినివల్ చేయడం జరగద న్నారు. జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తూ భ్రూణహత్యలు, ఆడపిల్ల ప్రాధాన్యంపై, బేటీ బచావో బేటీ పడావోపై పాఠశాలల్లో, కళాశాలల్లో గ్రామ, మండల స్థాయి సమైక్య సమావేశాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మొత్తం 6 టీమ్‌ల ద్వారా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను ప్రతీనెలా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నూతనంగా స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం 1 దరఖాస్తు, రినివల్ కోసం 7 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ దీప్తి, పిల్లల వైద్యులు హరిప్రియ, గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తిప్రియ, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భక్తుల శివనామస్మరణ వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ఇందూరు భక్తుల ఆధ్వర్యంలో శివపురాణం, ప్రవచనం కార్యక్రమంలో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగా నిర్వహించారు. ప్రవచకులు ఘణతుల మేఘరాజ్‌శర్మ వేదమంత్రాలు పఠించగా పండితులు కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులనుద్దేశించి మేఘరాజ్‌శర్మ ప్రవచనం చేస్తూ భౌతిక విషయాలలో శివ ఆరాధన అత్యంత శ్రేష్ఠమని అన్నారు.పుష్యమాసం ఉత్తరాయన పుణ్య కాలంలో శివపురాణం వినడం అదృష్టమని అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మంలో జరిగే పెళ్లి కన్యాదానం దాంపత్య గొప్పతనం వల్లే ప్రాశ్చత్య దేశాలు మనసంస్కృతి సంప్రదాయాలు ఆదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆగమయ్య గురుస్వామి చెన్న గంగరత్నం, పార్శి రాజు, ఎంసాని రవి, లబిశెట్టి శ్రీనివాస్, తదితర భక్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు రాజకీయాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత

ఇందల్వాయి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న మున్నూరుకాపులు రాజకీయాల్లో రాణించాలని మాజీ రూరల్ ఎమ్మెల్యే ఆకుల లలిత అన్నారు. మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఉన్న కాలంలోనే సిర్నాపల్లి గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని, సీసీ రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశానని అన్నారు. మున్నూరుకాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేశానని గుర్తు చేశారు. సిర్నాపల్లిలో 10వ తరగతి పరీక్షల సెంటర్ తన హయాంలోనే మంజూరైందన్నారు. మున్నూరుకాపులు ఐక్యం గా ఉంటేనే రాజకీయ భవిష్యతు ఉంటుందని కాపుల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు పెద్దలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

తప్పుడు అఫిడవిట్‌తో మాజీ ఎమ్మెల్యే బిగాల మోసం

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆదె ప్రవీణ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఆదె ప్రవీణ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త ఎన్నికల సందర్భంగా తప్పుడు అఫిడవిట్‌తో ఎన్నికల సంఘాన్ని మోసం చేశాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆదె ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2023అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన సందర్భంగా బిగాల గణేష్‌గుప్త సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు పత్రాలు ఇచ్చారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తన సొంత గ్రామం మాక్లూర్‌లో 9.16 ఎకరాల భూమిని రూ.4లక్షలకే కొన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారని కానీ అక్కడ ఉన్న భూమి విలువ రూ.2.70 కోట్లు అని అన్నారు. తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించిన మాజీ ఎమ్మెల్యేపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరు తున్నామన్నారు.ఈమేరకు ఎన్నికల సంఘానికి తాను ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే బిగాల ఆస్తులపై ఆదాయపన్ను శాఖ చేత విచారణ జరిపించాలన్నారు. ప్రజలకు సేవ చేయాలని ఎమ్మె ల్యేగా గెలిపిస్తే అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేకు గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఆయనకు లేదన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

● అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం వినతులు వెల్లువలా వచ్చాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీరాజేందర్, తదితరులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 225 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ ప్ర జావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు.

● రాగిజావ నిర్వహణ కార్మికుల పారితోషకం ఇవ్వాలి

మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన పీఎం పోషణ మినరల్స్ జిల్లాలోని పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కోసం పారితోషకం ఇవ్వడం లేదని కావున వెంటనే నెలకు రూ.1000ల చొప్పున నిర్వాహకులకు ఇవ్వాలన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కార్మికులకు ప్రమాదభీమా ఇవ్వాలన్నారు. కోడిగుడ్లు, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ నాయకులు నర్సింగ్‌రావు,హన్మాండ్లు,స్రవంతి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలి

మోడల్ స్కూల్ హాస్టల్ నాన్ టీచింగ్ సిబ్బంది పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని, కేజీబీవీ సిబ్బందికి ఇస్తున్న పద్ధతిలోనే వేతనాలు ఇవ్వాలని ప్రజగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నరేందర్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా నాయకుడి అరెస్టు

● రూ.20నగదు, పరికరాలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి

ఖిల్లా,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత రెండు నెలలుగా షెటర్లు ధ్వంసం చేసి షాపుల్లో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా నాయకుడిని ఒకటో టౌన్ పోలీసులు అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి రూ.20వేల నగదు, దొంగతనానికి వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకటరెడ్డి తెలిపారు. వివరాలను ఆయన చాంబర్‌లో సోమవారం విలేకరులకు వెల్లడించారు. జిల్లాలో ప్రజలను భయబ్రాంతులకు గురి చేసే విధంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠా సభ్యుల కోసం ఏసీపీ ప్రత్యేక పోలీసు బృందంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి నేతృత్వంలో సిబ్బంది దొంగల ముఠాసభ్యుల్లో ప్రధాన సూత్రధారి అయిన మహారాష్ట్ర పర్బనికి చెందిన కరణ్‌సింగ్‌ను అరెస్టు చేశారన్నారు ఆయనను విచారణ చేయగా పలు ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చాయన్నారు. కరణ్‌సింగ్‌తో పాటు మహారాష్ట్ర లాథూర్‌కు చెందిన కరణ్‌సింగ్‌బావూరి,మనోహర్‌సింగ్, అజయ్‌సింగ్‌లు కలసి ముఠాగ ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారన్నారు. వీరందరు రద్దీ లేని సమయంలో మధ్యరాత్రి 2గంటల అనంతరం దొంగతనాలకు పాల్పడేవారన్నారు. షట్టర్లను కేవలం పది నిమిషాల్లో ఎవరికి అనుమానం రాకుండా షట్టర్లను ధ్వంసం చేస్తారన్నారు. జిల్లా కేంద్రంలోని పూసలగల్లీలో ఈనెల 20న బట్టల దుకాణం తాళం ధ్వంసం చేసి అందులో నుంచి రూ.5వేలు, విలువైన వస్త్రాలు అపహరించినట్లు తెలిపారు. రెండవ రోజు హైదరాబాద్ రోడ్డులో గల ఓ మెడికల్‌షాపు షట్టర్‌ను ధ్వంసం చేసి అందులో నుంచి రూ.26,300ల నగదు దొంగించాడన్నారు. మూడవ రోజు రాత్రి చంద్రశేఖర్ కాలనీలో గల ఓ మెడికల్ షాపులో నుంచి రూ.3వేలు దొంగిలించినట్లు చెప్పారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల ఓ మెడికల్‌షాపును ఇనుపరాడ్‌తో షట్టర్ తీసి అందులో నుంచి రూ.4వేల నగదు, 3వెండిబిల్లలు,సీసీకెమెరాల డీవీఆర్‌లను తీసుకెళ్లారన్నారు. అంతకు ముందు ఈనెల 9న దుబ్బా ప్రాంతంలో ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను దొంగలించి బైక్‌పై తిలక్‌గార్డెన్‌కు వెళ్లి అక్కడ గల కాంప్లెక్స్‌లోని మెడికల్‌షాప్ షెటర్‌ను ధ్వంసం చేసి అందులో నుంచి రూ.85,000ల నగదును అపహరించినట్లు తెలిపారు. అదే రోజు పూసలగల్లీలోని ఓ బట్టల దుకాణం షెటర్‌ను ధ్వంసం చేసి అందులో నుంచి రూ.2లక్షల 40వేల నగదును దొంగిలించినట్లు చెప్పారు. అదే రోజు డిచ్‌పల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద గల బంగారు దుకాణం షట్టర్‌ను కట్టర్‌తో ధ్వంసం చేసి అందులో నుంచి 4వేలు నగదు చోరీ చేశారన్నారు. నవంబర్‌లో అజయ్‌తో కలిసి బైక్‌పై వచ్చిన వీరు జిల్లా కేంద్రంలోని కోర్టు సమీపంలోని ఓ మెడికల్ షాపు షట్టర్‌ను ధ్వంసం చేసి అందులో నుంచి రూ.5లక్షల నగదు అపహరించారన్నారు. అదే రోజు జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో గల ఓ



వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి

మెడికల్‌షాపు షట్టర్‌తాళం ధ్వంసం చేసి అందులో నుంచి 2లక్షల నగదును అపహరించారన్నారు. దొంగతనాలు చేసినా పోలీసులకు దొరకకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. ముఖ్యంగా శరీరంను మాస్క్‌తో కప్పుకుని ఆనవాళ్లు లేకుండా దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తులు అని తెలిపారు. ఈ దొంగతనాలు చేసిన ముఠా సభ్యుల్లో మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందని, వీరిలో ప్రధాన సూత్రధారుడు అయిన కరణ్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి, ఎస్ఐ. మొగలయ్య, ఏఎస్ఐ.షకీల్, ఐడి పార్టీ కానిస్టేబుల్ కృష్ణనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లా: జిల్లా కేంద్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిల్లో బైక్ దొంగతనాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మూడవ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసిపి. ఎల్.రాజవెంకటరెడ్డి తెలిపారు. వివరాలను ఆయన చాంబర్‌లో నగర ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రాజుతో కలసి వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడిన గుండారం గ్రామానికి చెందిన తాడెం అనిల్ అనే వ్యక్తి జిల్లా కేంద్రంలో బైక్‌లను అపహరించేవాడరన్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసునమోదు చేసుకుని విచారణ చేపట్టిన మూడవ టౌన్ పోలీసులు ఈనెల 24న కంఠేశ్వర్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వెళ్తున్న అనిల్‌ను ఆపి విచారణ చేశారన్నారు. మద్యానికి బానిసై డబ్బుల కోసం వాహనాలను దొంగిలించే వాడని చెప్పడంతో నేరం అంగీకరించడం వల్ల ఆయన వద్ద నుంచి 4బైకులు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించినందుకు నగర ఇన్స్‌పెక్టర్, మూడవ టౌన్ ఎస్ఐ హరిబాబును, సిబ్బందిని అభినందిస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: గంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి

మోపాల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఏమీ జరగలేదని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి అన్నారు. సోమవారం మోపాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు కాలంలోనే మండలాల అభివృద్ధికి కోట్లాది రూపాయలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మోపాల్ మండల అభివృద్ధి కోసం రూ.9కోట్ల 24లక్షల 20వేలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు.ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌డీఎఫ్,ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మంజూరైన నిధులతో మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రెండు మూడు రోజుల్లోనే ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. మండలంలో న్యాల్‌కల్‌లో రూ.2కోట్ల 26లక్షలతో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఠాణాకుర్దు గ్రామంలోసుమారు రూ.2 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, ఐడీసీ ఎంఎస్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, మాజీ జెడ్పీటీసీ మోహన్,మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీను, బాడ్సిసొసైటీ వైస్ చైర్మన్ రాజ కిషన్, కిరణ్ రావు ఉన్నారు.

నంది పేట్: మండలంలో క్రీడలు ఆడేందుకు అనుకూలమైన స్థలాలు లేవని మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నందిపేట మండల అధ్యక్షుడు మంద మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని నందిపేట్ బ్యాడ్మింటన్ హబ్ పోటీల బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రీడాకారులు ఉన్నా ఆడుకోవడానికి అనువైన స్థలాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి కాలేజ్ అధినేత నాగసురేష్, సామాజిక సేవకుడు మాన్‌పూర్ భూమేష్, త్రివేద్, వినయ్, మాజీ సర్పంచ్ తోటగణేష్, నందిపేట్ బ్యాడ్మింటన్ హబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ ప్రాంతాలన్నీ ఎంతో అభివృద్ధి చెందాయని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి మారుపేరు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరు నవీన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్ ఆరజశేఖర్‌రెడ్డి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని మళ్లీ నేడు సీఎం రేవంత్ రెడ్డి కాలంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని గుర్తు చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో ఇందల్వాయి గ్రామాల్లో పలు అభి వృద్ధి కార్యక్రమాలకు రూ.21 కోట్ల 92లక్షల 83వేలు మంజూరు అయ్యాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, డీసీసీడెలిగేట్ సుధాకర్,నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండలానికి వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.14కోట్ల 38 లక్షలు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి ప్రకటించారు. సిరికొండలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాటిపల్లి గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2కోట్ల 50లక్షల 60వేలు, గడ్కోల్ గ్రామ పరిధిలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2కోట్ల 46లక్షల 50వేలు, తూంపల్లి గ్రామంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.68లక్షలు మంజూరైనట్లు ఆయన వివరించారు. సిరికొండ గ్రామ పరిధిలోగల పవిత్రమైన లొంక రామలింగేశ్వర దేవాలయానికి వెళ్లడానికి నిర్మించే రోడ్డుకు రూ.3కోట్లు, గోప్యనాయక్ తాండా పరిధిలో జెడ్పీ రోడ్డు నుండి సర్పంచ్ తాండా మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 26లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గొల్ల ఎర్రన్న, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు నర్సింగ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు చందర్, సంతోష్, జనార్ధన్, సంతోష్ నాయక్, బాల్‌రాజ్ నాయక్, సిరికొండ సొసైటీ చైర్మన్ గంగాధర్, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● టీయూలో ఆందోళన చేసిన వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు

డిచ్‌పల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1200మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేయాలని బేసిక్, హెచ్‌ఆర్ఏ, డీఏ, తో కూడిన మూల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తు తెలంగాణ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం వర్సిటీ కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకుడు దత్తహరి విలేకర్లతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరన కార్యక్రమంలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... యూనివర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించినందున ముందుగా వర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యూలర్ చేసి తమ కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు ఉన్న తమను గుర్తించాలని గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యూలరైజ్ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు దేవరాజ్ శ్రీనివాస్, శరత్, కిరణ్ రాథోడ్, సురేశ్, గంగాధర్, జ్యోత్స్న కిరణ్ రాథోడ్, శ్రీనివాస్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరికొండ,జనవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని పందిమడుగు గ్రామంలో సిరికొండ ఎస్సై ఎల్.రాము ఆధ్వర్యంలో యు వకులు, గ్రామ పెద్దలు ర్యాలీ నిర్వహించారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పా టిస్తూ హెల్మెట్ ధరించాలని ఎస్సై కోరారు. హెల్మెట్ ధ రించడం వల్ల ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణా లను కాపాడుకునే పరిస్థితి ఉంటుందని మద్యం తాగి వాహనాలు నడపరాదని ఆయన కోరారు. మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు.

టీయూలో ఏఐఎస్ఎఫ్ నిరసన

డిచ్‌పల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వర్సిటీల మూసి వేతకు యూజీసీ నిబంధనలు తెర లేపిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘురాం అన్నారు. సోమవారం తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నూతన విద్య విధానం 2020 లో భాగంగా తీసుకొస్తున్న ఈ ప్రతిపాదనలు పెడరల్ స్ఫూర్తి ఉల్లగింస్తు రాజ్యాంగం మూల సూత్రాలను బలహీన పరిచేల ఉన్నాయని రాష్ట్రల హక్కుల ను దెబ్బ తీసి స్వయం ప్రతిపత్తి అనిచివే యాలని చూస్తుందని ఆరోపించారు. ఉన్నత విద్య యూజీసీ నిబంధనల ద్వార రాష్ట్రాల హక్కులను కేంద్రం లాక్కుంటుందన్నారు.ఈనిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, సాయి, చందు, సంజయ్, గౌతమ్, దినేశ్, పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని కళాశాల స్థాయి విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వెల్నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని కళాశాల విద్యార్థుల కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వెల్నెస్ ప్రైవేటు ఆసుపత్రి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. త్వరలోనే నిజామాబాద్‌లో వెల్నెస్ ఆసుపత్రి ప్రారంభం కానుందని జిల్లా ప్రజలకు ఈ ఆసుపత్రి ద్వారా ఎన్నో వైద్య సేవలు అందుతాయని తాను ఆశిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. స్వయంగా క్రికెట్ ఆడి తాను చదువుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ కుమార్, ఎండీ సుమన్‌గౌడ్, అసద్‌ఖాన్, వివేక్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, రైతు కమీషన్ మెంబర్ గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు, సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అంతిరెడ్డి రాజరెడ్డి, ముప్ప గంగారెడ్డి, విపుల్‌గౌడ్, మీసాల సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు క్రికెట్ లీగ్ జరుగుతుందని 24 టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.200	రూ.265	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.205	రూ.270	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.82400	రూ.76000	రూ.950

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్ర్కీన్-2 : స్కై ఫోర్స్ (హిందీ) (10.50, 1.35, 7.25, 10.10)
: డాకు మహారాజ్ (4.20)
స్ర్కీన్-3 : తల్లి మనస్సు (11.05)
: గాంధీతాత చెట్టు (2.10, 8.00)
: గేమ్ చేంజర్ (4.40)
: హత్య (10.30)
స్ర్కీన్-4 : డియర్ కృష్ణ (11.00)
: ఐడెంటిటీ (1.45)
: హాంకాంగ్ వారియర్స్ (5.00)
: డాకు మహారాజ్ (7.20)
: పుష్ప-2 (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1: ఐడెంటిటి (1.30)
: డాకు మహారాజ్ (4.30, 10.20)
: గేమ్ చేంజర్ (7.20)
స్ర్కీన్-2 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.30, 4.30, 7.20, 10.00)
స్ర్కీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (11.00, 1.50, 4.50, 7.20, 10.30)

దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : స్కైఫోర్స్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్